మంగళగిరిలో జాతీయ ఓటరు దినోత్సవం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా పథకము, ఎస్వీఈఈపీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంకు నిర్మల ఫార్మసీ కళాశాల ఎస్వీఈఈపీ సూపం వైజింగ్ ఆఫీసర్ సీహెచ్ సీతామహాలక్ష్మి, నోడల్ ఆఫీసర్ రెవరెండ్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి పాల్గొన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసినా సభా కార్యక్రమంలో సీతామహాలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఓటు అనేది మన భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు దాటినటువంటి ప్రతి భారత పౌరులకు కల్పించినటువంటి హక్కు అని, ఈ హక్కును సరైన మార్గ ంలో సరైన నాయకులను ఎన్ను కోవడం ద్వారా ఆదర్శవంతమైన సమా జం రూపు దిద్దుకుంటుందని తెలియజేశారు. సిస్టర్ జి.నిర్మల జ్యోతి మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని, హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు జాతీయ ఓటరు దినోత్సవంపై ప్రజలకు అవగాహన కలుగజేసేందుకు ఆత్మకూరు హైవే సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖా నరేష్ బాబు, సమన్వ యకర్త ఆర్.నరసింహ నాయక్, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ దివ్యశ్రీ, హేమలత, రితేష్, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

7వ వార్డులో 'గుడ్ మార్నింగ్' కార్యక్రమం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి పట్టణం 7వ వార్డు, ఏపీఎస్పీ క్యాంప్, సర్దార్ వల్లభాయి పటేల్ ఆర్చ్ నుంచి గురువారం గుడ్ మార్నింగ్ కార్యక్రమం 4వ రోజు ప్రారంభమైంది. కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవి ముఖ్య అతిధిగా పాల్గొని నియోజకవర్గ ప్రజలతో వారి అభిప్రాయాలను, సమ స్యలను తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేస్తున్నారు. గంజి చిరంజీవి మాట్లాడుతూ ప్రజలకు జరిగిన అభివృద్ధి సంక్షేమాలను, వివరిస్తూ వారికి ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకొని తక్షణ పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. ఇల్లు లేని వారికి ఇళ్ల పట్టాలు అంద జేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బెజ్జం రాజాజీ, మంగళగిరి పట్టణ వైసీపీ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, వల్లంశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో సత్తా చాటిన చెంచుపేట శ్రీచైతన్య విద్యార్థులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : క్యాట్ ఒలింపియాడ్ 2023-24 పరీక్షల్లో 41మంది తెనాలి చెంచుపేట శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధురి తెలిపారు. గురువారం కళాశాల ప్రాంగణంలో ఒలింపియాడ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం నూతలపాటి అంజయ్య, ఆర్ఐ అప్పాజీ, కో-ఆర్డినేటర్ గోపీ, డీన్ రవి, సీ-బ్యాచ్ ఇన్‌ఛార్జ్ భగత్ విద్యార్థులను అభినందించారు.

బీసీలకు కల్పించిన చట్టబద్ధత దూదేకులు నూర్‌బాషాలకు కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సమాజంలో దూదేకులు, నూర్ బాషాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగ పరంగా వెనుకబడి ఉన్నారని గుంటూరు జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులు స్టార్ మస్తాన్ ఏపీ మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌కు విన్నవించారు. గురువారం మైనార్టీ కమిషన్ కార్యాల యంలో అహ్మద్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్టార్ మస్తాన్ మాట్లాడుతూ సమాజంలో దూదేకులను..నూర్‌బాషాలను పరుష పదజాలంతో అవమాన రీతిలో అవహేళన చేస్తున్నారని అహ్మద్ ఖాన్ ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. ముస్లిం, మైనార్టీలతో అంతర్భాగమైన మాకు మైనార్టీల చట్టాలను వర్తింపజేయాలని ఆయనను కోరారు. బీసీలలో ఒకరైన నాయీ బ్రాహ్మణులకు, రజకులకు, యాదవులకు బ్యాక్వార్డ్ క్లాసెస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా జీవో నెంబర్ 50 చట్టబద్ధత కల్పించారో అదేవిధంగా నూర్‌భాషా, ముస్లిం సోదరులకు విడుదల చేయాలని స్టార్ మస్తాన్ కోరారు.

పొన్నూరు ప్రాంత వాసులను అభినందించిన కలెక్టర్

విశాలాంధ్ర-పొన్నూరు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం గురువారం జరిగిన కార్యక్రమంలో పొన్నూరు ప్రాంతానికి చెందిన పలువురిని కలెక్టర్ ప్రశంసా పత్రాలను బహుకరించారు. ఎస్ఎస్ఆర్ 2024కు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పొన్నూరు ఎంఈఓ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తమ సూపర్ వైజర్‌గాను కె.చిన్న హనుమంతు నాయక్, డి.దివ్య రాణి, చేబ్రోలుకు చెందిన జె.ఫణి ప్రవళిక, నంబూరుకు చెందిన ఆర్.అనీష్ ఉత్తమ బీఎల్వోలుగాను వీరికి ఉత్తమ ఎన్నికల సిబ్బందిగా గుర్తించి ఘనంగా సత్కరించారు. వీరిని పొన్నూరు తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ ఎన్నికల నిర్వహణ అధికారి ఫణి కుమార్‌లు అభినందించారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి ఏపీఐఐసీ బిల్డింగ్‌లోని రాష్ట్ర పరిశ్రమల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమల శాఖ అడిషనల్ కమిషనర్ ఏవీ పటేల్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు బుల్లా రాజారావు కలిసి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. బుల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు 45 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేసినందుకు కమిషనర్ పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలు ఆన్‌లైన్‌లో సబ్సిడీ రుణాలు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అడిషనల్ కమిషనర్ ఏవీ పటేల్‌ను బుల్లా శాలువాతో సత్కరించారు.

నేటి బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేటి బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ మెంబర్, ప్రముఖ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ షమ సుల్తాన అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా హోప్‌విన్ హాస్పిటల్స్, యువ నారిస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మలినేని పెరుమాళ్ళ ఫార్మ కాలేజీ, మాస్టర్స్ మైండ్స్ న్యూ జాగృతి పెదపలకలూరు క్యాంపస్ నందు శిక్షణా తరగతులు నిర్వహించారు. డాక్టర్ షమ సుల్తాన మాట్లాడుతూ బాలికలు నిర్దిష్టమైన లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాకారం చేసుకునేలా ప్రయత్నాలు చేయాలని కోరారు. ముఖ్యంగా ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, రక్తహీనత లక్షణాలను ముందుగానే తెలుసుకుని జాగ్రత్త వహించాలని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ మైండ్ న్యూ జాగృతి క్యాంపస్ ప్రిన్సిపల్ సత్యవతి, మలినేని పెరుమాళ్ళ ఫార్మ కాలేజీ డైరెక్టర్ డి.శ్రీనివాస కుమార్, హెచ్ఓడీ రాజేష్, హోప్‌విన్ హాస్పిటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఓటు హక్కును రాజ్యాంగం మనకు ఉచితంగా ఇచ్చిన హక్కుగా భావించకుండా, డబ్బు, ప్రలోభాలకు లోనుకాకుండా బాగా ఆలోచించి ఓటు హక్కును వినియోగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. బుధవారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, కమిషనర్ కీర్తీ చేకూరి, డిఆర్ఓ చంద్ర శేఖర రావు, ఆర్డిఓ పి.శ్రీఖర్, అదనపు కమిషనరు లక్ష్మీ శివజ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు విలువ తెలుసుకొని ఓటింగ్ సందర్భంలో తప్పక తమ ఓటును వేయాలన్నారు. ఇటీవల జరిగిన ఓటరు నమోదు కార్యక్రమంలో ఎక్కువ మంది యువతను నమోదు చేయడం జరిగిందని తెలిపినందున యువత తమ ఓటును సద్వినియోగపరచాలన్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలు ఎన్నుకున్న వారే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి పరిపాలన సాగిస్తారన్నారు. పోలింగ్ రోజున ఓటింగ్ ఎక్కువగా జరిగేందుకు పోలింగ్ బూతులను ఎక్కువగా ఏర్పాటు చేస్తే మరింత సౌకర్యవంతంగా వుంటుందన్నారు. డబ్బుకు, ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛంధంగా ఓటు వేయడం మన నుండే ప్రారంభమయ్యేట్లు ప్రతి ఒక్కరు ప్రయత్నించాలన్నారు. మన వల్ల క్యాండిడేట్లు ఖర్చు చేసే పరిస్థితి లేకుండా చేద్దామన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాన్ని, దేశాన్ని చక్కదిద్దుదామని ఆశిస్తున్నట్లు తెలిపారు.

కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించుకుంటున్నాం అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు కావడం, ఓటరుగా నమోదు అయిన అనంతరం ఎన్నికల సంఘం నిర్ణయించిన తేదీన పోలింగ్‌లో విధిగా పాల్గొని తమ ఓటును సద్వినియోగపరిచే విధంగా అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలియజేయాలనే ఉద్దేశ్యంతో అనేక విధాల ప్రచార కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర శాసన సభకు, పార్లమెంటుకు ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరిం చుకొని సంయుక్త కలెక్టర్ రాజకుమారి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వీడియో ప్రసంగాన్ని ప్రదర్శిం చడం జరిగింది. సమావేశంలో పీడ బ్ల్యూడీ యాప్ (సక్షం యాప్) నమోదుపై జిల్లా విభిన్న ప్రతిభావంతుల, ట్రాన్స్ జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త, పోలింగ్ బూత్ లలో చేపట్టిన మౌలిక ఏర్పాట్లపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. స్వాతి, పోస్టల్ బ్యాలెట్ అంశంపై చేబ్రోలు తహశీల్దార్ గోపాల కృష్ణ వివరించారు. సీనియర్ సిటీజన్ ఓటర్లను సన్మానించారు. ఎస్.వీ.వీ. ఈ.పీ కార్యక్రమాలు నిర్వహిం చిన విద్యాసంస్థల ప్రతినిధులను, విధుల్లో అత్యంత ప్రతిభ చూపిన సూపర్వైజర్లు, బీఎల్వోలకు మెమెం టోలు, ప్రసంశపత్రాలు అందించారు. నూతనంగా ఓట ర్లుగా నమోదైన యువ తకు ఎపిక్ కార్డులు అందించారు. జాతీయ ఓటర్ల దినోత్సవంలో వివిధ పోటీలల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లకు అవగాహనకు రూపొందించిన శకటాన్ని, ర్యాలీని కలెక్టరేట్ వద్ద కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

షరీఫ్‌కు రాజధాని రైతుల సన్మానం

విశాలాంధ్ర-తుళ్లూరు : మూడు రాజధానుల బిల్లు శాసనమండలిలో చర్చకు వచ్చినప్పుడు ఛైర్మెన్‌గా ఉన్న మహమ్మద్ అహ్మద్ షరీఫ్‌ను రాజధాని రైతులు, మహిళలు, టీడీపీ, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు సన్మానించారు. అమరావతి మహోద్యమం గురువారంతో 1500 రోజులు కావడంతో మందడం రైతు దీక్షా శిబిరంలో షరీఫ్‌కు సన్మానం చేశారు. న్యాయ దేవత విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, పి.అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, పట్టాభి, కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, రాయపాటి శైలజ, పులి చిన్నా, మేళం భాగ్యారావు, కమ్మెల శ్రీధర్, బెల్లంకొండ నరసింహారావు తదితరులు తదితరులు ప్రసంగించారు. అమరావతి ఉద్యమం 1500 వందలకు చేరడంతో రాజధాని గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టారు. దీక్షా శిబిరాల్లో ఆందోళనలు సాగాయి. మహిళా రైతులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పులి చిన్న బైక్ ర్యాలీ జరిపారు. తుళ్లూరులో రైతులు, చిన్నారులు 1500 రోజులను సూచించే ప్లకార్డులు పట్టుకొని జై అమరావతి అంటూ నినదించారు.

భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-పొన్నూరు : సుదీర్ఘ కాలంగా భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన కార్మికులను ప్రభుత్వం ద్వారా నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి ఆర్థిక సహాయం అందించాలని పొన్నూరు నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షులు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. ప్లంబింగ్ అండ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సభ్యుడు భవనానికి బోర్లు తీసే కార్మికుడు మండే మహేంద్ర అనే కార్మికుడు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని, ఆయన చింతలపూడి గ్రామానికి సంబంధించిన కార్మికుడు ఆయనకు డయాలసిస్, ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుంచి ఆ కార్మికుని ఆదుకోవాలని కోరారు. చింతలపూడిలో అతని నివాసానికి వెళ్లి బోర్ ప్లంబింగ్ అండ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కంచర్ల సుధీర్, కొండేటి బ్రహ్మం, గురుప్రసాద్, అచ్చయ్య, తిక్కవరపు సుబ్బారావు, వినోద్‌లు చింతలపూడి గ్రామానికి వెళ్లి మండే మహేంద్రని పరామర్శించి యూనియన్ నుంచి రూ.8 వేలు ఆర్థిక సహాయం అందించారు.

ఆర్డినెన్స్ రద్దు చేయాలి : ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: భూసేకరణలో పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు నష్ట పరిహారం ఇవ్వలేమని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. గురువారం స్థానిక 2/7 బ్రాడీపేట లోని కొరటాల సత్యనారాయణ మీటింగ్ హాల్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అధ్యక్షవహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అభివృద్ధి అనే ముద్దు పేరుతో వివిధ ప్రాజెక్టులు, పరిశ్రమలు, నేషనల్ హైవేలు, విమానాశ్రయాల పేరుతో పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూములన్నీ లక్ష్యంగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం లాక్కుంటుందని విమర్శించారు. 2013 భూ సేకరణ పునరావాస చట్టాన్ని నీరుగార్చి దళితుల భూములకు చట్టబద్ధంగా నష్టపరిహారం ఇవ్వకుండా కార్పొరేట్లకు కట్టపెట్టేందుకు కుట్ర చేస్తుందని తీవ్రంగా విమర్శించారు. బిజెపి రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత భూమిని కూడా సరుకుగా మార్చి భూ చట్టాలన్నింటికీ పాతర వేసి పేద రైతులు, దళితుల చేతుల్లో ఉన్న భూములన్నీ లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములు పొందిన దళితులకు హక్కులు కల్పించి ధనిక రైతులుగా మారుతామని చెప్పి మరో ప్రక్క అదే దళితులను తమ భూముల నుండి ప్రభుత్వం ఎప్పుడు కోరితే అప్పుడు తమ అవసరాల కోసం ఇవ్వాలని ఎంతో కొంత నష్టపరిహారంగా ఇచ్చి తీసుకోవాలని హక్కులను కాలరాస్తూ సత్కరించే ఉన్న హక్కులను కాలరాస్తూ అసైన్డ్ లబ్ధిదారులు కోర్టుకు వెళ్ళరాదని ఆర్డినెన్స్ తెచ్చిందని తెలిపారు. ఈ ఆర్డినెన్స్ అమలు కోసం జీవో నెంబర్ 23 తెచ్చిందని తెలిపారు. ఈ ఆర్డినెన్స్ వెంటనే రద్దుచేసి 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పట్టాదారులకు సమానంగా అసైన్డ్ భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భారత్ బచావో జిల్లా నాయకులు సమత ప్రఫుల్ల ఉపాధ్యాయ, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వం తెచ్చిన ఆర్డినేషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. బికేయంయు జిల్లా కార్యదర్శి కె.ఈశ్వర్ రావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.విఠల్ రెడ్డి, బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, విప్లవ స్థానిక జన సమాఖ్య నాయకులు బి.విల్సన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, నగర కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.

28న డ్యాన్స్ రియాలిటీ షో సూపర్ జోడీ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు : తెలుగు ప్రేక్షకులకు అలరించే జీ తెలుగు ఈ నెల 28వ తేదిన మరింత వినోదం అందించేందుకు సిద్ధమైంది. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు భగవంత్ కేసరి సినిమా, రాత్రి 9 గంటలకు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ముఖ్యఅతిథిగా సూపర్ జోడి కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రసారం కానున్న ఈ సూపర్ జోడీ షోకు యాంకర్‌గా ఉదయభాను వ్యవహరించనున్నారు. న్యాయనిర్ణేతలుగా ఎవర్‌గ్రీన్ నటి మీనా, ప్రముఖ కొరియోగ్రాఫర్ రఘుమాస్టర్, హీరోయిన్ శ్రీదేవి విజయ్ కుమార్ వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా జీ తెలుగు 'బనావో బేటీకో షేర్' కాంటెస్ట్‌ను నిర్వహించనుంది. ఈ పోటీలో విజేతలుగా నిలిచిన వారు సర్‌ప్రైజ్ గిఫ్ట్ పొందుతారు.

హిందూ ఫార్మశిలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అమరావతిరోడ్డు హిందూ ఫార్మశి కాలేజీ గురువారం డి.ఫార్మశి, బి.ఫార్మశి, ఎం.ఫార్మశి, ఫార్మా.డి కోర్సుల్లో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐర్లాండ్‌లోని లియో కన్సల్టెంట్ అధినేత డేవిడ్ మాట్లాడుతూ ఫార్మశి విద్యార్థులు డిగ్రీ అనంతరం యూనివర్సిటీలో పీజీ విద్యను అభ్యసించి ఔషధ రంగంలో గొప్పగొప్ప పరిశోధనలు చేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ హిందూ ఫార్మశి కళాశాలలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను..మౌళిక వసతులను ఉపయోగించుకుని ఉత్తమ ఫార్మసిస్టులుగా, ఉత్తమ పౌరులుగా పేరు గడించి కళాశాలకు మంచి గుర్తింపు తేవాలని కోరారు. ఫ్రెషర్స్ డే వేడుకల సందర్భంగా తొలుత విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూధనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రవికుమార్, ఫార్మ.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు యువ ఓటర్లపైనే ఆధారపడి ఉంది : కేంద్ర మంత్రి

విశాలాంధ్ర-మంగళగిరి: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని కేంద్ర ఆరోగ్యం కుటుంబం సంక్షేమ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్ అన్నారు. గురువారం మంగళగిరి ఎయిమ్స్‌లోని ఆడిటోరియంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. శక్తివంతమైన ప్రజాస్వామ్యం దేశ అభివృద్ధికి సరైన అభ్యర్థులకు ఓటు వేయడం యొక్క ప్రాముఖ్యతను ఆమె నొక్కిచెప్పారు. స్వీయ-అభివృద్ధి కోసం డిజిటల్ టెక్నాలజీని బాగా ఉపయోగించడంపై ఆమె విద్యార్థులతో సంభాషించారు. దేశంలోని ఆరోగ్య సంరక్షణ యోధులుగా విద్యార్థులను ప్రేరేపించారు. ఎంబీబీ ఎస్ విద్యార్థులకు ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేసింది. ఆమె ఎయిమ్స్ మంగళగిరి ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష జరిపి, పురోగతిపై సంతోషం వ్యక్తం చేస్తూ ఈ సంస్థను తన ప్రాంతానికి, దేశానికే కాకుండా విదేశాలకు కూడా ఆరోగ్య సంరక్షణ గమ్యస్థానంగా తదుపరి స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఎయిమ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ టీఎస్ రవికుమార్, ఎయిమ్స్ డైరెక్టర్ అండ్ సీఈవో మదహ బానంద్ధకర్, డాక్టర్ శ్రీమంత్ కుమార్ దాస్, ఏయిమ్స్ అకాడమిక్ డాక్టర్ దేసు రామ్మోహన్, డాక్టర్ వినీత్ థామస్ అబ్రహం మెడికల్ సూపర్డెంట్, పాల్గొన్నారు.

తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటా నని తూర్పు నియోజకవర్గ వైసీపీ నియోజక వర్గ షేక్ నూరి ఫాతిమా అన్నారు. ఈ మేరకు గురువారం నియోజకవర్గంలోని 53వ డివిజన్‌లో నూరి ఫాతిమా పర్యటించి స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ గుంటూరు పట్టణ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అందులో భాగంగా పట్టణంలో సీసీరోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక వసతులు అభివృద్ధి, అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించి ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 53వ డివిజన్ కార్పొరేటర్ దూపాటి వంశీబాబు, వైసీపీ నాయకులు సాల్మన్, పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతికతతోనే శాస్త్రీయ పురోగతి

విశాలాంధ్ర-మంగళగిరి: శాస్త్ర సాంకేతిక రంగాలతోనే శాస్త్రీయ పురోగతి సాధ్యమనీ, సైన్స్ అండ్ టెక్నాలజీ లేనిదే ఏ దేశమైనా అభివృద్ధి చెంద లేదని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిరీష్ సాహ్ని పేర్కొన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సి టీలో గురువారం సాయంత్రం జరిగిన యూనివర్సిటీ 17వ విశిష్ట ప్రసంగ కార్యక్రమానికి హాజరై శాస్త్ర సాంకేతికత, శాస్త్రీయ పురోగతి, పరిశోధనలకు పెరుగుతున్న ఆదరణ గురించి ప్రసంగించారు. శాస్త్ర సాంకేతిక రంగ పరిశోధనలకు భారత్ తగినంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు డాక్టర్ గిరీష్ సాహ్ని పేర్కొన్నారు. యువ పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు కొత్త ఆలోచనలకు పదును పెట్టాలనీ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. నూతన సృజనల దిశగా అడుగులు వేసేందుకు మార్గాలను అన్వేషించుకోవాలని పేర్కొన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా తన స్వాగతోప న్యాసంలో యూనివర్సిటీ పరిశోధనలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను, సహకారాన్ని వివరించారు. డాక్టర్ గిరీష్ విశిష్ట ప్రసంగంపై యూనివర్సిటీ సలహాదారు డాక్టర్ వజ్ఞా సాంబ శివరావు, ఎస్ఆర్ఎం గ్రూప్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. నారాయణరావులు దృశ్యమాధ్యమ పద్ధతిలో తమ అభిప్రా యాలను వెల్లడించారు. యూనివర్సిటీ ఇన్చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కల్లూరి వినాయక్, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపాలు డాక్టర్ గిరీష్ను దుశ్శాలు వాతో సత్కరించి జ్ఞాపికను ప్రదానం చేశారు. డాక్టర్ సుదర్శన్ గోవిందరాజన్, డాక్టర్ రాజపాండియన్ పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత సైనిక కుటుంబాల అమర వీరుల ఫోటో ఎగ్జిబిషను వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా ప్రారంభించారు. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు చెందిన 40 మంది అమరులైన సైనికుల ఫోటోలను, వారి పోరాట పటిమను వివరించే ఎగ్జిబిషన్ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

జిల్లా స్థాయి ఎంప్లాయిస్ హెల్త్ స్కీం సమావేశాన్ని ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ) గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావుకు వినతిపత్రం గురువారం అందజేశారు. చాంద్‌బాషా మాట్లాడుతూ జిల్లా స్థాయి ఈహెచ్ఎస్ కమిటీ నందు ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు ఉద్యోగులకు ఇస్తున్న ఈహెచ్ఎస్ రాయితీలు..నెట్వర్క్ హాస్పటల్ నందు ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకునేలా జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని చాంద్ బాషా కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా షాఖాదరి, నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగర శాఖ సంయుక్త కార్యదర్శి జాన్ పాల్గొన్నారు.

ఉత్తమ సూపర్‌వైజర్ అవార్డు అందుకున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు నియోజకవర్గం ఎన్నికల సూపర్ వైజర్‌గా ఉత్తమ అవార్డును పొన్నూరు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. పొన్నూరు తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంఈఓ శ్రీనివాసరెడ్డిని అభినందించారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

జనసేన, బీజేపీ కలిసి ఎన్నికలకు వెళతాం: కేంద్ర మంత్రి

విశాలాంధ్ర-మంగళగిరి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, బిజెపి కలిసి ఎన్నికలకు వెళతామని కేంద్ర ఆరోగ్య కుటుంబం సంక్షేమ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్ అన్నారు. గురువారం పాత మంగళగిరిలో గల బీజేవైఎం రాష్ట్ర నాయకులు నవనీత్ రెడ్డి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. గ్రామీణ పేద ప్రజలకు వైద్య విద్యను అందించాలని ఉద్దేశంతో ఒక్కొక్క విద్యార్థికి కోటిన్నర రూపాయలు ఖర్చుపెట్టి వైద్య విద్యను అందిస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో కార్పొరేట్ హాస్పిటల్‌కు దీటుగా మంగళ గిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లుగా తెలిపారు. రవాణా సౌకర్యం, తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. అదేవిధంగా మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ ప్రతినెల రెండవ శనివారం, ఆదివారాల్లో సెలవు ఉంటుందని, దీనివలన ఎమర్జెన్సీగా వైద్యం అందించడానికి వీలు లేకుండా పోతుందని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి భారతి ఈ విషయం తమకు తెలియదని తెలిపారు. తెలుసుకుంటానని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక బీజేపీ నాయకులు పి ప్రసాద్, జె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమరావతిలో అసువులు బాసిన రైతుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నాలుగున్నరేళ్లుగా అమరావతిలో అసువులు బాసిన రైతుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే నని, అమరావతి విచ్చిన్నంతో 17 లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ముఖ్యమంత్రి గండి కొట్టారని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేసారు. అమరావతి రాజధాని పరిరక్షణ మహోద్యమం 1500వ రోజు పూర్తి చేసుకున్న సందర్భముగా అమరావతి పరిరక్షణ యువజన జెఏసి కన్వీనర్ రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో రైతులకు సంఘీభావంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత బృందావన్ గార్డెన్స్ నుండి ప్రారంభమైన ర్యాలీ హిందుకళాశాల సెంటర్లో గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు చేరుకొని అమరజీవి విగ్రహానికి నివాళులర్పించిన కలెక్టరేట్ ఎదుట ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద ముగించి తెలుగుతల్లి విగ్రహానికి నివాళులర్పించి రాజధాని ఉద్యమంలో మానసిక వేదనతో అసువులు బాసిన రైతులకు శ్రద్ధాంజలిగా మౌనం పాటించారు. సాయి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థి జెఏసి గుంటూరులో చేపట్టిన బైక్ ర్యాలీ 1500 రోజుల అమరావతి రైతులు మహిళల వీరోచిత పోరాటానికి, రాజధాని కోసం అసువులు బాసిన అమరవీరులకు ఇటీవల రాజధాని తరలింపు బాధతో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన దళిత జెఏసి కన్వీనర్ గడ్డం మార్టిన్ లూథర్‌కు అంకితమన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి నేత షేక్ జిలాని, మేధావుల ఫోరమ్ నేతలు భాష్యం నరసయ్య, రైతు నాయకులు రావిళ్ల వెంకటయ్య, షేక్ ఫిరోజ్, తెలుగుయవత పెద్దఎత్తున పాల్గొన్నారు.

యువ ఓటర్లపైనే దేశ భవిష్యత్తు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. గురువారం స్థానిక కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పురందేశ్వరి మాట్లాడారు. ఓటు హక్కు ఎంతో శక్తివంతమైన ఆయుధమని అన్నారు. ముఖ్యంగా యువ ఓటర్లపైనే దేశ భవిష్యత్తు ఆధారాపడి ఉందని చెప్పారు. యువత దేశం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచించి మంచి నాయకులను తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు. 2024 ఎన్నికల్లో యువత ఓటు దేశ భవిష్యత్తుని నిర్ణయిస్తుందన్నారు. యువతకు జాతీయ భావాలు ముఖ్యమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నేడు భారత్‌కు ఉన్న ప్రతిష్ట ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వలననే సాధ్యమైందన్నారు. దేశంలో ఉన్న నాలుగు ప్రాంతాల్లో సాంస్కృతిక, ఆర్థిక అభివృద్ధికి కట్టుబడి నరేంద్ర మోదీ పాలన సాగిస్తున్నారని తెలిపారు. స్వామి వివేకానంద ప్రసంగాలతో యువత స్పూర్తి పొందాలని సూచించారు. 2024లో ఎన్నికల ప్రక్రియ 30 రోజుల్లో పూర్తి కానుందన్నారు. యూనివర్సిటీలోని ఇంక్యుబిలేటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ కృష్ణ మాట్లాడుతూ యువత స్టార్టప్ ఇండియాకు దిక్సూచి కావాలని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థ సారథివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, బీజేవైఎం నాయకులు మాధవ్, చైతన్య శర్మ, డాక్టర్ అభిరుచి మధు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు తగ్గించవచ్చు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వాహన రహదారి భద్రత నిబంధనలను తప్పని సరిగా పాటించాలని ఆక్టోపస్ ఎస్పీ రవిచంద్ర పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు నిర్వహించే 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా గురువారం వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు తగ్గించవచ్చన్నారు. ప్రమాదంలో వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం కోలుకోలేని నష్టం జరుగుతుందన్నారు. రక్షణ కోసమే రహదారి భద్రత నిబంధనలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్.కరీం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సంవత్సరానికి 4లక్షల 50వేలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందులో లక్షా 50వేలు మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నట్లు చెప్పారు. 2023వ సంవత్సరంలో గుంటూరు జిల్లా 965 రోడ్డు ప్రమాదాలు జరిగితే ఇందులో 320 మంది ప్రాణాలు కోల్పోయినట్లు కరీం తెలిపారు. ఈ వాకథాన్‌లో ట్రైనీ ఆర్టీఓలు మనోహర్, భరత్, ఎన్.గోపాల్, మోటార్ వాహన తనిఖీ అధికారి టి.తోట రాఘవరావు, తెనాలి మోటార్ వాహన తనిఖీ అధికారి వి.విజయ సారధి, మంగళగిరి మోటార్ వాహన తనిఖీ అధికారి అనిల్‌కుమార్, మల్లీశ్వరి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

KITS AUTONOMOUS
KKR & KSR Institute of Technology and Sciences
Approved by AICTE | Permanently Affiliated to JNTUK, Kakinada
Accredited with "A" Grade by NAAC | Accredited by NBA
Vinjanampadu (V), Vatticherukuru (M), Guntur - 17.
Ph: 0863-2286666, 77, 88, 99 | Email: principal@kitsguntur.ac.in
WALK-IN INTERVIEWS
Walk-in Interviews will be held at college campus at 9:30 am on 28-01-2024 (Sunday) for the following positions.

Positions	Departments
Professors & Associate Professors	Mathematics, Physics, Chemistry, English & Computer Science
Assistant Professors	

Candidates are requested to attend the interview with copy of Resume, PAN Card, Aadhar card, 2 photos and original certificates.
Qualification, experience and payscale are as per AICTE norms.
PRINCIPAL

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

అంగన్‌వాడీలలో ప్రత్యేక మెనూ

విశాలాంధ్ర-ఈపూరు : అంగన్‌వాడీల కేంద్రాల రూపురేఖలను మార్చి బలమైన పౌష్టికా హారాన్ని అందించే దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక మెనూ తయారుచేసి అమలు చేస్తున్నారని వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని కొచ్చర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే బొల్లా చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు బలమైన పౌష్టికాహా రాన్ని వైసీపీ ప్రభుత్వం అందజేయడం జరుగుతుందని, అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ సొంత భవనాలలో ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగానే కొచ్చర్ల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఆలనా, పాలనతో పాటు విద్యాభ్యాసం కోసం అమ్మఒడి లాంటి అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ అరుణ, సూపర్‌వైజర్లు, గ్రామ సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర-వినుకొండ : గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశం మందిరం నందు నూతన ఓటర్ల సమ్మేళనం, భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు మిట్టా వంశీ కృష్ణ మరియు పల్నాడు జిల్లా బీజేవైయం అధ్య క్షుడు రాజనాల వెంకట రాజీవ్‌రెడ్డి ఆదేశాల మేరకు నూతన ఓటర్ల సమ్మేళనం ఘనంగా జరిగింది. సమావేశం మందిరంలోని డిజిటల్ స్క్రీన్ పై ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా కళాశాల విద్యార్థినీ విద్యార్థులు వీక్షించారు. ప్రధాని ప్రసంగంలో యువత అభివృద్ధికి చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకున్నారు. మేక్ ఇన్ ఇండియా, స్టాండప్ ఇండియా, డిటిటల్ మనీ పేమెంట్స్, వందే భారత్, ఆత్మనిర్భర భారత్ తదితర అంశాలపై స్వయంగా ప్రధాని మోదీ చెప్పడాన్ని స్వాగతించారు. కార్యక్ర మంలో భారతీయ జనతా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కవల కుంట జాన్ బాబు, ఉపాధ్యక్షుడు జడ్డా లక్ష్మీ నారాయణ, పట్టణ బిజెవైయం అధ్యక్షుడు ధేనువ కొండ శ్రీహరి రాజు, పట్టణ బీజేపీ అధ్యక్షుడు నల్లూరి వీర రాఘవులు, కార్యదర్శి సుధా గణేష్, సుధాకర్, సీనియర్ నాయకులు అచ్యుత మూర్తయ్య తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీలోకి భారీ చేరికలు

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ నియోజకవర్గం లోని శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామంకు చెందిన అమృతపూడి యోగయ్య, అమృతపూడి పిచ్చయ్య, అమృతపూడి వెంకయ్య, వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో యువ నాయకులు బొల్లా గిరిబాబు సమక్షంలో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ లోకి చేరారు. పార్టీలో చేరిన వారికి వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభు త్వం ద్వారా ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ పథకాలకు, జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వైసీపీ లోకి చేరామని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ వైసీపీలో కుటుంబ సభ్యులే అని, వారికి పార్టీ తరపున సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర-గురజాల : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురజాల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని గురజాల మండలంలో ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారులు ర్యాలీ నిర్వహించి, ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో కోరారు. కార్యక్రమంలో రెవిన్యూ డివిజ నల్ అధికారి, ఓటర్ల నమోదు అధికారి రమణా కాంత్ రెడ్డి, తహశీల్దార్ దానియేలు, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఏఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గురజాల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏఏఎఫ్ నరసరావుపేట కన్వీనర్ న్యాయవాది కలివేల ప్రభుదాస్ గురువారం గురజాల బార్ అసోసియేషన్ న్యాయవాదుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఏఎఫ్ నరసరావుపేట పార్ల మెంట్ కన్వీనర్ జ్ఞానసుందరి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జానీ బాషా, న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, వై.వెంకటేశ్వర్లు, కత్తి చలమరాజు పాల్గొన్నారు.

నేడు గిరినాథ్ శర్మ సంస్మరణ సభ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : అఖిల భారత విశ్వకర్మ బ్రాహ్మణ జాతీయ కార్యదర్శి, సీఎస్‌జీ ఎల్ఎం జూనియర్ కళాశాల, ఓఎస్‌గీ యూనివర్సిటీ వ్యవస్థాపకులు చింతాడ గిరినాద్ శర్మ సంస్మరణ సభ ఆయన స్వగ్రామం సత్తెనపల్లిలో జరుగుతుందని పట్టణ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోటగిరి పోతులూరయ్య గురువారం తెలిపారు. స్థానిక వేద కళాశాలలో జరిగే సభకు మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వర రెడ్డి, వైవీ ఆంజనేయులు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు సింహాద్రి కనకాచారి, డిప్యూటీ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డాక్టర్ కె.శ్రీనివాసులు, ప్రగతి విద్యా సంస్థలు చైర్మన్ మక్కెన అచయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ బ్రహ్మానందం పాల్గొంటారన్నారు. విశ్వబ్రాహ్మణ సోదరులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేటి నుంచి బైబిల్ మిషన్ మహోత్సవాలు

విశాలాంధ్ర-పెదకాకాని : మండల పరిధిలోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా కాకాని తోట వారు ఏర్పాటు చేసిన బైబిల్ మిషన్ మహోత్సవములు శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు, రైల్వే సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేక పందిళ్లు వేయడం జరిగింది. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీటి సౌకర్యం, భోజన వసతి, వైద్య సౌకర్యం ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థానిక పోలీసు వారి సహకారంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

75 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-వినుకొండ : గీతాంజలి స్కూల్స్ నందు 75వ గణతంత్ర దినోత్సవ వేడుక లకు స్వాగతం పలుకుతూ గురువారం చిన్నారులు సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ టి. క్రిష్ణవేణి మాట్లాడుతూ డా.బాబా సాహెబ్ అంబేద్కర్ మరియు వారి సహచర బృందం ద్వారా భారత జాతికి రాజ్యాంగం ను అంకితం చేసిన జనవరి 26 ఎంతో పవిత్రమైన రోజు అని పూర్తి స్థాయిలో సంపూర్ణ స్వాతంత్రం సిద్ధించిన రోజు అని విద్యార్థులకు తెలియజేసారు. అలాగే ఈ 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోవడం మనకు ఎంతో గర్వకారణమని తెలిపారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో గీతాంజలి స్కూల్స్ కరస్పాండంట్ వై. కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

బొల్లాను ఓడించేందుకే వైసీపీకి గుడ్ బై

విశాలాంధ్ర-వినుకొండ : అధికార అహంకారంతో నేను చెప్పిందే వేదం అంటూ నియంతలా గాండ్రిస్తూ ప్రజలపై సవారి చేస్తున్న బొల్లా బ్రహ్మనాయుడును రానున్న ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ఎంపీటీసీ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ రామయ్యలు అన్నారు. వేల్పూరు-1 సెగ్మెంట్ అధికార పార్టీ ఎంపీటీసీ లింగా శ్రీనివాస రావు, మాజీ వైస్ సర్పంచ్ మారాసు రామయ్యల ఆధ్వర్యంలో దివ్యకోలు శ్రీనివాసరావు, సాదినేని వెంకటేశ్వర్లు (స్వామి) సాదినేని వేణుబాబు, కోంద్రు నాగేశ్వర రావు, బోయ పాటి హను మంతరావు, కాకాని వెంకటేశ్వర్లు, వేల్పుల నాగేశ్వర రావులతో పాటు గ్రామా నికి చెందిన 25 కుటుంబాలు స్థానిక పార్టీ కార్యాలయంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్య క్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో వైసీపీ నుండి టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియంత పాలన వ్యతిరేకిస్తూ బొల్లా అహంకారానికి గుణపాఠం చెప్పేందుకు బ్రహ్మనాయుడు సొంత గ్రామం వేల్పూరు నుండి తాము వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. గురు వారం మరో 60 కుటుంబాల వరకు వైసీపీ నుండి టీడీపీలో చేరేందుకు ఎస్సీ, బీసీ సామాజికవర్గాలు తమ వద్దకు వస్తే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అతని అనుచరులు బెదిరించి అడ్డుకున్నారని, కొన్ని రోజుల్లోనే వారంతా టీడీపీలో చేరటం ఖాయమ న్నారు. జీవి ఆంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని అన్నారు. బొల్లా అహంకారానికి, కక్ష సాధింపు, బెదిరింపులు, తప్పుడు కేసులు, దౌర్జన్యాలకు విసిగిపోయిన ప్రజలు వినుకొండలో అరాచక శక్తిని అంతమొదిం చాలని ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన వేల్పూరు గ్రామం నుండి వైసీపీ ఎంపీటీసీ శ్రీనివాసరావు, మాజీ వైస్ సర్పంచి రామాయలతో పాటు ప్రజలు వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరటం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో బొల్లా బ్రహ్మనాయుడు చిత్తుచిత్తుగా ప్రజలు ఓడించి తాము 40 వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని అన్నారు. యారమాసు కోటేశ్వరరావు, గుంటూరు సాంబశివరావు, గడిపూడి విశ్వనాథం, గోరంట్ల హనుమంతరావు, గద్దే మస్తాన్‌రావు, బోడెపుడి వెంకటేశ్వర్లు, బొల్లా పేరయ్య, సాదినేని కృష్ణమూర్తి, దొడ్డ ఏడుకొండలు, జుంజి యోహాను, బత్తుల వెంకటేశ్వరరావు, గన్నవరపు శ్రీనివాసరావు, అమృత పూడి కోటయ్య, మల్లవరపు రవి అమృతపూడి కోటయ్య కారుమంచి, ఇంకా పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా నిలిచిన సచివాలయ వ్యవస్థ

విశాలాంధ్ర-ఈపూరు : వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయాల ద్వారా నేరుగా ప్రజల ఇంటి వద్దకే చేరవేయడం జరుగుతుందని, ఈ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చెప్పాడంటే చేస్తాడంటే నమ్మకం ప్రజల్లో గట్టిగా ఉందని వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గురువారం మండలంలోని కొచ్చర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా గ్రామ సచివాలయ భవనాలను తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన విధానంను తీసుకొచ్చి, 1.30 లక్షల మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, ప్రతి సంక్షేమంను గడప ముందుకు తీసుకొచ్చి, ఎలాంటి సమస్యలు అయిన గ్రామాలలోనే పరిష్కారమయ్యే విధంగా గ్రామ పరిపాలన విధానం వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి సమస్యలు అయిన మండలంలో ఉన్న మండల కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరాగాల్సిన అవసరం ఉందని, నేడు అలాంటి పరిస్థితి లేకుండా వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతిఒక్కరికీ నవరత్న పథకాలు అందాలని నేరుగా వారి ఖాతాల్లోకే డబ్బులను జమజేస్తున్నామని గర్వంగా చెప్పుకునేలా పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద వారు ధనికులు అవుతారన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిఒక్కరూ జగనన్న సంక్షేమ పాలనకు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ ఓటర్‌కు సన్మానం

విశాలాంధ్ర-దుర్గి : తహశీల్దార్ రమేష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలో గురువారం ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద గ్రామానికి చెందిన సీనియర్ సిటి జన్ ఓటర్ మంగళగిరి సత్యనారాయణను ఓటర్ల దినోత్సవం సందర్భంగా అధికారులు ఆయనను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ టి.నిర్మల, జూనియర్ అసిస్టెంట్ రత్నకుమార్, వీఆర్వోలు టి.కోటేశ్వరరావు, ఎం.కిరణ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అనిల్‌శాస్త్రి, వీఆర్వోలు రత్నప్రకాష్, కరీముల్లా పాల్గొన్నారు.

బాల్య దశ నుండే దేశభక్తిని పెంపొందించాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: విద్యార్థులలో బాల్య దశ నుండే దేశభక్తిని పెంపొందించాలని తాసిల్దార్ వేముల వెంకట నాగరాజు అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని శ్రీరామ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు స్వతంత్ర సమరయోధుల వేషధారనలను దరించి పుర వీదులలో గురువారం ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య మాట్లాడుతూ స్వతంత్రం కోసం పోరాడిన సమరయోధుల వేష ధారణలు విద్యార్థులు ధరించటం వలన విద్యార్థులలో జాతీయ బావం పెరుగుతుందన్నారు. వైస్ ఎంపిపి చెన్నంశెట్టి రంగారావు, పాఠశాల కరస్పాండెంట్ కేవిఆర్ మోహన్ చంద్, ప్రిన్సిపల్ రత్నకుమారి, డైరెక్టర్ అజిత్ చంద్ పాల్గొన్నారు.

వీఆర్వోకు అవార్డు

విశాలాంధ్ర-రెంటచింతల: గోలి వీఆర్వో పాశం నాసరరెడ్డికి ఉత్తమ బీఎల్వో అవార్డు వచ్చినట్లు స్థానిక తహశీల్దార్ కట్టెకోట పుల్లారావు తెలిపారు. గోలి 218 బూత్ అధికారిగా పనిచేస్తున్న నాసరరెడ్డి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా తయారీలో ప్రతిభను కనపరిచినందుకు అవార్డు లభించినట్లు వివరించారు. వీరికి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అవార్డు అందజేశారు. పలువురు రెవెన్యూ అధికారులు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

విశాలాంధ్ర-రెంటచింతల: రెంటచింతల ఆంథోనివారి కాలనీ నందు సుమారు రూ. 12.50 లక్షల నిధులతో నిర్మించనున్న సిమెంటు రహదారి, మురుగు కాల్వల నిర్మాణానికి గురువారం భూమిపూజ చేసినట్లు ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి తెలిపారు. దుర్గి మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు ఆదూరి ఇన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, పేర్ల ముత్తయ్య, తుమ్మా ఇన్నారెడ్డి, అల్లం ప్రతాప్ రెడ్డి,పల్లెర్ల కోటిరెడ్డి, పల్లెర్ల లక్ష్మారెడ్డి,ఉమ్మా రామాంజనేయ రెడ్డి, తుమ్మా పాపిరెడ్డి తదితర నేతలు కొబ్బరికాయ కొట్టి పనులను ఆరంభించారు.

శ్రీ భావనఋషిస్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలు, క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-మంగళగిరి : పద్మశాలియ బహూత్తమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14వ తేదీన జరుగనున్న శ్రీ భద్రావతి సమేత భావనఋషిస్వామి వారి దివ్య కళ్యాణం మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలు, క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవిలు పాత మంగళగిరి పద్మశాలీయ కళ్యాణ మండపంలో గురువారం ఆవిష్కరించారు. మురు గుడు, గంజి మాట్లాడుతూ 1975వ సంవత్సరంలో సంఘం కళ్యాణ మండపాన్ని నిర్మాణం జరిపి శ్రీ భద్రావతి సమేత భావనఋషిస్వామి వారిని ప్రతిష్టించి ప్రతి ఏడాది స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకోవడం అభినందనీ యమన్నారు. ఈ ఏడాది జరిగే స్వామివారి కళ్యాణ మహోత్సవానికి కమిటీ ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కళ్యాణ మండపం అడహక్ కమిటీ మెంబర్ అండ్ టీడీపీ నేత నందం అబద్దయ్య, జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పూట్ల సాంబ శివరావు, ఎం.వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి పూట్ల వెంకట సాంబశివరావు, పద్మ శాలియ ప్రముఖులు పూట్ల శ్రీమన్నారాయణ, పాల శ్రీనివాస్, డి.బాబురావు, రావెల శివ సత్య నారాయణ, మునగపాటి మారుతీరావు, జొన్నాదుల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రాజధానిగా ప్రకటించేంత వరకు జనం పార్టీ పోరాడుతుంది

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి రాజధానిగా కొనసాగిం చాలని జనం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కంభం ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి పరిరక్షణ ఉద్యమానికి 1500 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తుళ్ళూరు మండలం వెలగపూడిలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరానికి మద్దతుగా కంభం ఆనంద్‌కుమార్ ఛలో వెలగపూడి అంటూ లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి బయలుదేరి వెళ్ళారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర రాజధాని వల్ల చదువుకున్న యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని అన్నారు.

ప్రజా ఉద్యమాల కరదీపిక విశాలాంధ్ర

విశాలాంధ్ర-పెదకూరపాడు : ప్రజా ఉద్యమాలకు విశాలాంధ్ర దినపత్రిక ఎంతగానో దోహదపడుతుందని పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యులు నంబూరు శంకర రావు అన్నారు. గురువారం విశాలాంధ్ర క్యాలెండర్, విశాలాంధ్ర డైరీ ఆవిష్కరి ంచిన అనంతరం ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర క్యాలెండర్ అన్ని విషయాలతో కూడిన వాస్తవికతను ప్రజలకు అందించడంలో ఒక ఉద్యమ కరదీపికగా నిలుస్తుందని అన్నారు. అన్ని వర్గాల ఉద్యమ పోరాటంలో ఒక తెలుగు నిఘంటువులు దోహదపడే విశాలాంధ్ర దినపత్రికని ప్రతిఒక్కరూ ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ విశాలాంధ్ర పీసీ ఇన్‌చార్జ్ మునుగోటి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు చైర్మన్ ఈ.సాంబిరెడ్డి, నర్రా శ్రీనివాసరావు, ఎంపీపీ కోటయ్య, జడ్పీటీసీ సభ్యులు గఫూరు, వైసీపీ నాయకులు దాసు వెంకట్రావు, కొమ్ము రామాంజనేయులు, హనుమంతరావు, సత్యరాజు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

శిల్ప కళాశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్

విశాలాంధ్ర-దుర్గి: మండల కేంద్రమైన దుర్గి, ఓబులేశునిపల్లె గ్రామాల్లో ఉన్న శిల్ప కళాశాలలను ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ గురువారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లో శిల్పుల తయారు చేసిన బొమ్మలను పరిశీలించారు. శిల్పులతో ఆమె మమైకమై వారి సాదర బాదకాలు అడిగి తెలుసుకున్నారు. శిల్పాలు తయారు చేయడానికి కావలసిన ముడిరాయి లభ్యమయ్యే దుర్గిలోని చాకలి కుంటను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ. కె.సమతావాణి, ఏఓ.పి.శివప్రసాద్, ఈవోపీఆర్డి. జీఎల్ఎన్ గుప్తా, ఎపీఎం. శివకుమార్, సర్పంచ్ మాణిక్యం, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ బెంజిమెన్, తదితరులు ఉన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధి : కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వికసిత భారతాన్ని సాధించేందుకు వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందించటం జరుగుతుందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డా.భారతి ప్రవీణ్ పవార్ తెలిపారు. గురువారం పెదనందిపాడు లోని పెదనందిపాడు ఆర్ట్స్ , సైన్స్ కళాశాల ఆవరణలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆయిష్మాన్ భారత్ వైద్య శిబిరం క్యాంపును, భూసార పరీక్షలు, ప్రకృతి వ్యవసాయం, బ్యాంకింగ్ సేవలు సామాజిక భద్రతా పథకాలు, ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, జాతీయ టీబీ నివారణ కార్యక్రమం, మై భారత్ వాలం టీర్ ఎన్రోల్మెంట్ మరియు ఆధార్ క్యాంప్ , పోషణ్ అభియాన్ స్టాల్స్‌ను కేంద్ర మంత్రి పరిశీలించి, పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. సభలో అందరితో సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. వ్యవసాయ డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారి ప్రదర్శనను కేంద్ర మంత్రి పరిశీలించి, వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ మంత్రి మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ప్రతి ఒక్కరు భాగస్వాములై సంక్షేమ పథకాల లబ్ధిని సద్వినియోగం చేసుకొని దేశం సర్వతోముఖాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మోహనరావు, ఆర్డీఓ పి.శ్రీకర్, డియం అండ్ హెచ్ ఓ డా. విజయలక్ష్మి , ఎల్డీయం మహిపాల్ రెడ్డి , డిఎస్ఓ కోమలి పద్మ, డిఈఓ శైలజ, తదితర అధికారులు పాల్గొన్నారు.

మతాన్ని స్వార్థం కోసం వాడుకోకూడదు: పవన్‌కళ్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి : ముఖ్యమంత్రి తన స్వార్థం కోసం మతాన్ని వాడుకునే వ్యక్తి తప్ప జీసస్ వాక్యాలు పాటించే వ్యక్తి కాదు. ఆయన నిజంగా జీసస్ వాక్యాలు పాటిస్తే రాష్ట్రాన్ని ఇలా ఇబ్బందుల పాలుజేసే వాడు కాదని జనసేన పార్టీ అధ్యకులు పవన్ కళ్యాణ్ అన్నారు. మానవత్వంతో నిలబడే వ్యక్తికి మతం ఉండదని, ఎవరైతే తన మతాన్ని ప్రేమించి, ఇతర మతాలను గౌరవిస్తాడో అలాంటి వారే ప్రజలకు న్యాయం చేయగలం'న్నాడు. నేను అన్ని మతాలనూ సమానంగా గౌరవిస్తాను కాబట్టే పార్టీ మూల సిద్ధాంతాల్లో మత ప్రస్తావన లేని రాజకీయం అనే సిద్ధాంతాన్ని చేర్చామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గురువారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ మత పెద్దలతో సమావేశం అయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ నేను మతాల గురించి మాట్లాడే సందర్భంలో కొంత మందికి ఇబ్బందికలగవచ్చు. అందుకు కారణం ఒక విధమైన అభద్రతా భావం. ఈ రాజకీయ నాయకులు సెక్యులరిజం అనే పదాన్ని ఓటు బ్యాంకుగా మలిచేశారు. మైనార్టీలపై దాడి జరిగినప్పుడు మాత్రమే అందరూ మాట్లాడ తారు. హిందువులపై దాడి జరిగితే ఎవరూ పట్టించుకోరన్న భావన సమాజంలో పెరిగి పోయింది. ఇలాంటి వ్యవహారాల్లో రాజకీయ నాయకులు రాజకీయా లకు అతీతంగా ప్రవర్తించాలన్నారు. ధర్మం ఎక్కడుంటే భగవంతుడు అక్కడ ఉంటాడని మనస్ఫూర్తిగా విశ్వసిస్తానని అన్నారు. ఈ ముఖ్యమంత్రి మతాన్ని తన స్వార్థం కోసం వాడుకునే వ్యక్తి తప్పించి, జీసస్ వాక్యాలు పాటించే వ్యక్తి కాదని అన్నారు. కోనసీమ కలహాల సీమ కాదు ప్రేమ సీమ అని నిరూపిద్దామని అన్నారు.

ఆచరణలేని జీఓలతో వృద్ధులు బజారుకెక్కారు

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పలు జీఓలు ఆచరణకు నోచుకోక జీవిత చరమాంకంలో ఉన్న పెన్షనర్లు రోడ్డున పడ్డారని తెనాలి సంఘ అధ్యక్షులు మాచిరాజు రామకృష్ణ మూర్తి అన్నారు. రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ పిలుపు మేరకు చినరావూరు పార్కు వద్ద చేసిన ధర్నాలో పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ జీవితకాలం సేవలందించినందుకు గాను పెన్షనర్లకు రావల సినవి రాక పోగా అడిగితే వేధింపులకు రాష్ట్రప్రభుత్వం గురిచేస్తుందని అన్నారు. పెన్షన్ ఒకరి దయా దాక్షిన్యాల మీద ఆధారపడి ఇచ్చేది కాదని హక్కు అని నకరా కోర్టులో పోరాడి విజయం సాధించిన విషయం గుర్తు చేశారు. ఇప్పటికైనా పిఆర్‌సి డిఆర్ బకాయిలు, 70-75 సంవత్సరాలకు తగ్గించిన అడిష నల్ క్వాంటం పునరుద్దరించాలని మెడికల్ రియంబర్స్‌మెంట్ 5 లక్షలకు పెంచాలన్న ధర్నాలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పి.సూర్యప్రకాశరావు, గుత్తా వెంకటరత్నం, గరికపాటి సుబ్బారావు, రేణుకయ్య, హరిదాస గౌరీశంకర్, సోమయ్యశాస్త్రి, అజ్గర్ అలీ రైతు సంఘనాయకుడు ములకా సాంబిరెడ్డి, సిఐటియు హసన్ అలీ యుటిఎఫ్ నాయకులు బసవేశ్వరరావు, 200పైగా సభ్యులు పాల్గొన్నారు.

యడ్లపాడులో జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర-యడ్లపాడు : 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండల తహశీల్దార్ వైవీబీ కుటుంబరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్, ఉప తహశీల్దారు శ్యామలత, ఈఓపీఆర్డీ వరూధిని, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హెచ్ఎం పద్మ లత, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి శశికళ, బీఎల్ఓ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఓటరు బత్తుల సూర్యనారాయణకు సన్మానం నిర్వహించారు.

రెండవ పంట సాగు చేసిన రైతులు ఆర్బీకే కేంద్రాన్ని సంప్రదించాలి

విశాలాంధ్ర-దుర్గి : మండలంలో రబీ సీజన్‌లో మొక్క జొన్న, కంది పంటలు సాగు చేసిన రైతులు ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రా లను సంప్రదించాలని దుర్గి రైతు భరోసా కేంద్రం హర్టికల్చర్ అసిస్టెంట్. బి. కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. కావున రైతులు రైతు భరోసా కేంద్రానికి వచ్చేటప్పుడు ఆధార్, పొలం పాసుబుక్ జిరాక్స్ తమ వెంట తీసుకుని వచ్చి పంట నమోదు చేసుకోవాలని ఆయన గురువారం కోరారు.

నేడు జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకూరపాడు: రాజకీయ చరిత్రలోనే బీసీలకు పెద్దపీట వేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీనేనని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అర్తిమల్ల రమేష్ అన్నారు. శుక్రవారం పెద్దకూరపాడు సాయి శ్రీనివాస కళ్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే, పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ అధ్యక్షతన అమరావతి పెద్దకూరపాడు మండలాలకు సంబంధించి నిర్వహించ తలపెట్టిన జయహో బీసీ సదస్సు నిర్వహణ ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. అమరావతి, పెదకూరపాడు మండలాల్లోని బీసీ నేతలు, రాష్ట్ర జిల్లా మండల కార్యవర్గాల్లోని వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల 30 ని॥కు జరిగే సదస్సులో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కర్పూరి ఠాగూర్‌కు భారతరత్న ఇవ్వడం గర్వకారణం

విశాలాంధ్ర-పెదకాకాని : భారత స్వాతంత్ర సమరయోధుడు భారత దేశంలో మొట్టమొదటి నాయి బ్రాహ్మణ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్‌కు భారతరత్న అవార్డును ప్రకటించడం పట్ల మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల క్షవరవృత్తిదారుల సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తిని కొనియాడారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో కాకాని సుబ్బారావు, ముస్నంగి రాంబాబు, కాకాని చిన్ని, కొమ్మూరి మల్లికార్జునరావు, సదాశివరావు, శివ, శంకర్, పాములు, తిరుపతిరావు, పూర్ణచంద్రరావు ఉన్నారు.

యుటీఎఫ్ నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పురపాలక ఉపాధ్యాయుల దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం మండల విద్యావనరుల కేంద్రము, తెనాలిలో నిరసన ప్రదర్శన చేశారు. యుటిఎఫ్ గుంటూరు జిల్లా ఆర్థిక కార్యదర్శి యండి. గయాసుద్దౌలా హాజరై గత నెల రోజులుగా మున్సిపల్ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలైన బదిలీలు, ప్రమోషన్లు, పి.ఎఫ్ ఖాతాలుఏర్పాటు, సర్వీసు రూల్స్ ఏర్పాటు వంటి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నతాధికారుల ద్వారా పలుమార్లు విన్నవించినప్పటికీ ఏ విధమైన పురోగతి లేకపోవడంతో విజయవాడలో ధర్నాకి పిలుపునిచ్చారని చెప్పారు. దానికి నిరసనగా గురువారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన నిర్వహించారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

27న వేదోపనిషత్ గీతలు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-తెనాలి : ఈ నెల 27వ తేదీన తెనాలి కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో వేదోపనిషత్ గీతలు (ప్రస్థాన త్రయం) యోగా, వేదగీత, మహర్షి దయానందుని సందేశంలపై అవగాహన సదస్సు మహర్షి వ్యాసపీఠం- వేదాలయ ఆధ్వర్యంలో సాయంత్రం 4.00 గంటలకు జరుగుతుందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మొవ్వా సత్యనారాయణ చెప్పారు. గాంధీనగర్ ఇస్కఫ్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన తెలిపారు. సభకు రచయిత, సీనియర్ జర్నలిస్ట్ తాళ్ళూరి శివరామకృష్ణ అధ్యక్షత వహిస్తారని, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరౌతారని తెలిపారు. సభను ఆచార్య శశల తాళ్ళూరి (అమెరికా చల్లా ఫౌండేషన్ సెక్రటరి) ప్రారంభిస్తారని చెప్పారు. ఆర్య సభ సెక్రటరీ అచార్య వితలరావు, విజ్ఞాన్ గ్రూప్స్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్, డా.లావు రత్తయ్య, నాసా సైంటిస్ట్ డా.చందుసాంబశివరావు, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.మేడాసాని మోహన్, దళిత విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, మహాత్మాగాంధీ శాంతి సేవా ఆశ్రమం, తెనాలి నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి సభలో ప్రసంగిస్తారని తెలిపారు. డా.అయినాల మల్లేశ్వరరావు సమన్వయ కర్తగా వ్యవహరిస్తారని సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మధుర గాయకులు తెనాలి వెంపటి సత్యనారాయణ బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చు

విశాలాంధ్ర-మంగళగిరి : రోడ్డు భద్రత నిబంధనలు పాటించటం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చని అక్టోపస్ ఏఎస్పీ రవిచంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రవాణా శాఖ 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా గురువారం మంగళగిరి నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని ప్రతి ఏడాది రవాణా శాఖ ఆధ్వర్యంలో 24వ తేదీ నుంచి ఫిబ్రవరి 19 వరకు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ఎక్కువగా విద్యార్థులు, యువకులు నిత్యం రోడ్డుపైన తిరుగుతారని వాహనాలు నడుపుతున్న సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. గుంటూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో 90 శాతం మానవ తప్పిదాల వలన జరుగుతున్నాయని అన్నారు. ప్రతిఒక్కరూ వాహనం నడిపే సమయంలో ఏకాగ్రతతో ఉంటూ రోడ్డు రవాణా శాఖ ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పాటించాలని కోరారు. ప్రైవేటు వాహనాల్లో అధికంగా ప్రయాణికులకు ఎక్కిస్తున్నారని దీనివలన ప్రమాదాలు జరుగుతాయని, డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముందుగా పాత బస్టాండ్ సమీపంలో విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, రవాణా శాఖ ప్లే కార్డులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. తెనాలి, మంగళగిరి, గుంటూరు మోటారు వాహనాల తనిఖీ అధికారులు టి.రాఘవరావు, విజయ సారథి, అనిల్ కుమార్, ఆర్టీవో మనోహర్, ఎంవీఐలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ కళాశాల విద్యార్థులు, ఆటోడ్రైవర్లు, మంగళగిరి రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.